కొత్త సీరియల్ ప్రారంభం!



ప్రతాప రవిశంకర్

రోనాల్డ్ అపార్టుమెంట్స్. ఇరవై నాలుగో ఫ్లోర్ లోని ఓ గదిలో భారత్ హడావిడిగా ఏవో కొన్ని వస్తువులను సూట్కేసులలోకి సర్దుకుంటున్నాడు.

వెనక్కి వాలినట్టున్న కుషన్ ఛెయిర్లో బాగా వెనక్కి ఒరిగి అతడి చర్యలను నిశితంగా పరిశీలిస్తూ కూర్చుంది స్టెల్లా.

అప్పుడు సమయం ఐదుగంటలు కావస్తోంది.

సాయంత్రం. సూర్యుడి కిరణాలు అద్దాల కిటికీల్లోనించి పలుచగా లోపలకు పడుతున్నాయి.

ఒక్కసారి భారత్ వెనక్కి తిరిగి తననే చూస్తున్న స్టెల్లాని "ఏమిటలా చూస్తున్నావు?" అన్నాడు చిరునవ్వుతో.

"నీ అందాన్ని" నవ్వింది స్టెల్లా.

భారత్ మాట్లాడలేదు.

చేస్తున్న పనిని వదిలి ఆమె దగ్గరకు వచ్చి ముందుకు వంగి ఎర్రగా దొండపండులా వున్న ఆమె పెదవులమీద ముద్దు పెట్టుకుని "థాంక్ యూ డియర్" అన్నాడు.

"యూ ఆర్ స్వీట్ మై డియర్" అన్నదామె.

అతను తిరిగి తన పనిలో నిమగ్నమయిపోయాడు.

అతడి అందం స్టెల్లాను చెప్పలేనంతగా ఆకర్షించింది. అందుకే తను అమెరికన్ యువతి అయివుండీ కూడా భారతీయుడైన భారత్‌ను ప్రాణాధికంగా ప్రేమించింది.

భారత్ అందం యెంతోమంది అందమైన యువతులనే గిలిగిలింతలు పెడుతుంది.

సీలింగ్ ఫ్యాన్ గిర్రున తిరుగుతోంది.

స్టెల్లా ఒక్కసారి ఛెయిర్‌లోనించి లేచి ఒళ్ళు విరుచుకుంది. ఎదురుగా వున్న మిర్రర్‌లో తన రూపాన్ని చూసుకుంది. గర్వంగా ఓసారి తన అందాన్ని చూసుకుని చిరునవ్వు నవ్వుకున్నది.

ఐతే భారత్‌కు స్టెల్లా చేష్టలు ఏవీ పట్టలేదు. అతని దృష్టి వజ్రాలమీదే వున్నది. అతను రహస్యంగా కొన్ని వజ్రాలను కస్టమ్స్ అధికారుల దృష్టి పడకుండా దాచే ప్రయత్నంలో వున్నాడు. ఆ ప్రయత్నాలు అతనికి బాగానే తెలుసు.

భారత్ గత కొన్ని యేళ్ళుగా వజ్రాల వ్యాపారం భారీయెత్తున చేస్తున్నాడు. ఆ వ్యాపారంలో అతను కోట్లకొలదీ ఆస్తి సంపాదించాడు. ఐనా సంపాదించాలనే తపన అతనిలో చల్లారలేదు. అత్యంత విలువైన వజ్రాలను సంపాదించటం అతని జీవిత ధ్యేయం.

విండో దగ్గర నిలుచుంది స్టెల్లా. అక్కడినించి కిందికి

చూస్తుంటే రివ్వున దూసుకుపోతున్న మోటారు వాహ నాలు కనపడుతున్నాయి.

ఆమె ఒక్కసారి వాచీకేసి చూసుకుని అదిరిపడుతూ "మైగాడ్....ఇటీజ్ ఆల్ రెడీ ఫైవ్ థర్టీ" అన్నది.

"యస్....డియర్....నా పని పూర్తయ్యింది. నువ్వు నీ లగేజ్ అంతా సిద్ధం చేసుకున్నట్లేనా?" ఆమె దగ్గ రగా వస్తూ అన్నాడు భారత్.

"ఎప్పుడో అయిపోయింది మేన్. ఐయామ్ వెరీ థాంక్స్ టు బి కమ్ విత్ యూ" అన్నది అతని భుజం మీద రెండు చేతులూ వేసి కళ్ళలోకి చూస్తూ.

"యూ ఆర్ క్రేజీ" అన్నాడు ఆమె బుగ్గలమీద వేలితో రాస్తూ.

"ఐయామ్ నాట్ క్రేజీ. ఐయామ్ ఇన్ లవ్ విత్ యూ...."

నిముషాలు గడుస్తున్నాయి.

భారత్—స్టెల్లా ఈ లోకంలో లేరు.

ఇద్దరూ ఒకరి కౌగలిలో ఒకరు వొరిగిపోయారు. స్టెల్లా అమితంగా ఆవేశపడిపోతోంది. భారత్ కూడా అదే స్థితిలో వున్నాడు కాని అతనిలో ఎన్నోరకాల ఆలోచ నలు గిర్రున తిరుగుతున్నాయి.

ముఖ్యంగా—కెరోన్....

ఆమె గురించే అతను భయపడుతున్నాడు.

ఉన్నట్టుండి అతను స్టెల్లాను వదిలాడు.

"వాట్ హేపెండ్!" ఆశ్చర్యంగా అడిగింది.

"నథింగ్....వుయ్ హేవ్ టు స్టార్టు....ఇటీజ్ గోయింగ్ టు బి సిక్స్."

"నో... యు ఫెల్ట్ సమ్‌థింగ్....ప్లీజ్ టెల్."

స్టెల్లా అతన్ని వదల్లేదు. అతని కళ్ళలో ఒక్కసారిగా కదిలిన భయాన్ని ఆమె గ్రహించింది. ఇలాంటి విషయాలను పసికట్టటంలో ఆమె చాలా తెలివైనది.

"సారీ స్టెల్లా.... నేను కరోన్ గురించి ఆలోచిస్తున్నాను. తెలిసో తెలియకో నావల్ల ఓ పొరపాటు జరిగిపోయింది. ఇప్పుడు నాకేమిటి దారి?"

"ఓహ్" తల విదిలించింది.

"ఆ డర్టీ బిచ్ గురించి ఆలోచిస్తున్నావా? అది ఇక్కడకు రాకముందే మనం యిక్కడినించి బయటపడదాం."

"నో.... ఇట్స్ నాట్ పాజిబుల్.... కరోన్ నా కోసం ఏర్‌పోర్టుకొస్తుంది...."

స్టెల్లా ఏదో మాట్లాడబోయింది.

కాని___

ఇంతలోనే కాలింగ్ బెల్ మోగింది.

"మై గాడ్.... నో డౌట్.... ఇటీజ్ కరోన్.... ముందు నువ్వు రూమ్‌లోకి వెళ్ళు" అన్నాడు భారత్.

స్టెల్లా పక్కనే వున్న ఓ గదిలోకి వెళ్ళి దాక్కుంది.

తలుపులు మూసి బోల్టు బిగించి వెళ్ళి డోర్ ఓపెన్ చేశాడు.

• • •

ఎదురుగా___కరోన్ చేతిలో బరువైన సూట్‌కేసుతో నిలుచుని వుంది,

తలుపు తెరుచుకోగానే ఒక్కసారిగా లోపలకు దూసుకువచ్చి సూట్కేసును వదిలి అతని తల పట్టుకుని ముందుకు వంచి భారత్ పెదవులమీద గాఢంగా ముద్దు పెట్టుకుంది.

ఆ ముద్దుకు అతడు ఉక్కిరిబిక్కిరయ్యాడు. మరో సమయంలో ఐతే అతను యెంతో సంతోషం పొందే వాడు.

కాని—ఇప్పుడు అతను భయపడుతున్నాడు ఆమె గురించి—

ఆమె కూడా భారత్‌తో ఇండియాకు వస్తానన్నది. అతను తీసుకు వెళతానని ఆమెతో స్వర్గపు అంచుల్లో ప్రమాణం చేసేటప్పుడు చాలాసార్లు ప్రామిస్ చేశాడు.

అందుకే కరోన్ తనకువున్న ఆస్తి సంతటినీ బంగారం—వజ్రాలుగా మార్చి అతనితో బయల్దేరటా నికి వచ్చేసింది.

"డియర్ భారత్ ....నువ్వు నా కోసమే యెదురు చూస్తున్నట్టున్నావు...." అంటూ అతను సర్దుకున్న లగేజ్‌ను చూస్తూ. "నువ్వు రెడీ అయినట్టున్నావు....ఇక బయల్దేరుదామా?" అన్నది.

భారత్ మాట్లాడలేదు.

అతని మౌనం కరోన్‌కు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"వాటీజ్ దిస్ సైలెన్స్" అతడి కళ్ళలోకి చూస్తూ అడిగింది.

"ఐయామ్ సారీ కరోన్ ....యు ఆర్ నాట్ కమింగ్ విత్ మి... " అన్నాడు.

కరోన్ ఉలిక్కిపడింది.

క్షణం తర్వాత "ఎందుకని?" అన్నది.

"ఈసారి ఇక్కడకు వచ్చినప్పుడు తప్పకుండా నిన్ను తీసుకు వెళతాను."

"ఇప్పుడేమయ్యింది?"

"ఏమయ్యిందో నేను చెబుతాను."

గిరుక్కున వెనక్కు తిరిగింది కరోన్.

రూమ్ తలుపులు తెరుచుకుని వున్నాయి.

అక్కడ స్టెల్లా నిలబడి వుంది. ఆమె చేతిలో రివాల్వర్ వుంది. అది సూటిగా కరోన్ కే గురిపెట్టబడి వుంది.

"యూ...." ఆగిపోయింది కరోన్.

"అవును. ఐయామ్ స్టెల్లా.... భారత్ తో ఇండియాకు నేను వెళుతున్నాను."

రివాల్వర్ ను వూపుతూ అంది.

కరోన్—భారత్ కేసి తిరిగి "యూ చీట్....నువ్వు ఇంత మోసగాడివని అనుకోలేదు. డర్టీ ఇండియన్" అంటూ వూహించలేనంత వేగంగా అతడిమీదకు పులిలా దూకింది.

ఆ విసురుకు వెనక్కుపడబోయి ఎలాగో ఆగిపోయాడు భారత్.

"స్టాపిట్....భారత్ ను వదులు. లేకపోతే షూట్ చేస్తాను" అరిచింది స్టెల్లా.

కరోన్—స్టెల్లా హెచ్చరికను లక్ష్యపెట్టలేదు. ఆమెకు కసిగా వుంది, అతను తనని మోసగించినందుకు. ఎంతో ఆశతో వచ్చింది అతనితో ఇండియాకు వెళ్ళిపోవాలని.

కంపూచియా వచ్చినప్పుడల్లా భారత్ ఆమెను పీల్చి వేస్తున్నాడు. ఓ బొమ్మలా వాడుకుంటున్నాడు తన పనులన్నింటికీ.

అందుకే కరోన్ గుండె మండింది.

ఆడపులిలా అతనిమీద విరుచుకపడి అతడి గొంతును పట్టుకునే ప్రయత్నాన్ని చేస్తోంది.

"డోంట్ యూస్ ది రివాల్వర్" అరిచాడు భారత్.

కాని—అప్పటికే ఆలస్యమయ్యింది.

సైలెన్సర్ అమర్చిన రివాల్వర్ పేలింది. బుల్లెట్ దూసుకువచ్చి కరోన్ వెన్నులో దిగబడిపోయింది.

కెవ్వున అరుస్తూ భారత్‌ను వదిలేసింది. అతను పక్కకు తప్పుకున్నాడు.

బోర్లా పడిపోయింది కరోన్.

అప్పుడు స్టెల్లా ఆమె దగ్గరగా వచ్చింది.

"నువ్వు తొందరపడ్డావు. షూట్ చెయ్యకుండా వుండవలసింది" అన్నాడు భారత్.

నవ్వింది స్టెల్లా.

"నేను షూట్ చెయ్యకుండా వున్నట్లయితే ఈ డెవిల్ నీగొంతునొక్కి చంపేసి వుండేది."

అతను మాట్లాడలేదు.

నెత్తురు కారుతోంది కరోన్ వీపులోంచి. ఆమె గిలగిలా తన్నుకుంటోంది.

ఒక్కసారి తలెత్తి యిద్దరినీ చూసి చిన్నగా ఇలా అంది:

"ఇందుకు తగిన ఫలితం యిద్దరూ అనుభవిస్తారు. యూ ఆర్ డెవిల్స్.... ఈ పాపం మిమ్మల్ని వెంటాడుతూనే వుంటుంది."

ఇంకేదో అంటున్నప్పుడు "స్టాప్ నాన్సెన్స్" అంటూ మరోసారి ఆమె తలకేసి రివాల్వర్ పేల్చింది స్టెల్లా.

అంతే. కరోన్ తల వాల్చేసింది.

ఆ దృశ్యాన్ని, స్టెల్లా తెగువను చూసి చలించి

పోయాడు భారత్.

అప్పుడామె రివాల్వర్‌ను పర్సులో గుండెల మధ్య దాచుకుని "ఉయ్ హావ్ నో టైమ్.... ముందు మనం ఈ శవం సంగతి చూడాలి" అన్నది.

"ఏం చేద్దాం?"

"ఇండియాకు తీసుకు వెళదామా?"

"డోంట్ కట్ జోక్స్ స్టెల్లా!.... టేకిట్ సీరియస్."

"ఆల్‌రైట్.... బాత్‌రూమ్‌లోకి ఈడ్చుకు వెళదాం. లాక్ చేసి వెళ్ళిపోదాం. ఇక్కడి పోలీసులకు ఈ వార్త తెలిసేసరికి మనం ఈ దేశం వదలి వెళ్ళిపోతాం."

"ఓకే...." అంటూ అతను ముందుకు వంగాడు.

ఇద్దరూ కేరోన్ శవాన్ని బాత్‌రూమ్‌లోకి ఈడ్చుకు వెళ్లారు.

పూర్తిగా ఓ కార్నర్‌లోకి ఈడ్చేశారు.

స్టెల్లా బాత్‌రూమ్‌లో వున్న ఎలక్ట్రిక్ బల్బును రివాల్వర్‌తో పగలగొట్టింది.

"ఎందుకు బల్బును పగలగొట్టావ్?"

"ఎవరైనా స్విచ్ నొక్కినా దీపం వెలగదు. లోపల వున్న ఈ డెవిల్ ఎవ్వరికీ వెంటనే కనపడదు."

"యూ ఆర్ జీనియస్."

భారత్ ఆమె తెలివిని మెచ్చుకున్నాడు.

ఐదు నిమిషాల్లో అక్కడి నెత్తురును నీళ్ళతో కడిగి యెలాంటి ఆనమాలు లేకుండా తుడిచేసింది స్టెల్లా.... బాత్‌రూం లాక్ చేశారు.

అంతా అయిపోయిన తర్వాత "వుయ్ హావ్ డన్ ఎ గుడ్ థింగ్...." అన్నది.

"అవును. ఇక మనం బయల్దేరుదాం" అన్నాడు భారత్.

"ఓ.కె...." అంటూ తన లగేజ్‌ను తీసుకుంది.

భారత్ — కరోన్ సూట్‌కేసును అప్పుడే చూసి "జస్ట్ మినిట్" అని దాన్ని ఓపెన్ చేశాడు. అందులో మరో బాక్స్ వుంది.

దాన్ని తెరిచి "మై గాడ్! డైమండ్స్ .... గోల్డ్ కాయిన్స్" అన్నాడు సంతోషంగా.

"పూర్ కరోన్ ....ఎనీ హౌ థాంక్స్ టు కరోన్" అన్నది సెల్లా వాటిని చూసి.

"ఉయ్ ఆర్ లక్కీ" అంటూ అతను రెండు నిమిషాల్లోనే తన సూట్‌కేసులో వున్న రహస్య అరల్లో సర్దేశాడు వాటిని.

మరో పదినిమిషాలు గడిచాయి.

ఆ ఇద్దరూ లిఫ్ట్‌లో కిందికి వచ్చారు.

* * *

అప్పటికి వెలుతురు పూర్తిగా పోయింది.

చీకటి తెరలు అంతటా కమ్ముకున్నాయి.

చలిగాలి కూడా మొదలయ్యింది.

ఖాళీగా వెళుతున్న టాక్సీని ఆపింది సెల్లా.

అందులో ఇద్దరూ కూర్చోగానే "ఏర్‌పోర్టు" అన్నాడు భారత్.

చిన్న జర్క్‌తో ముందుకు కదిలింది టాక్సీ.

వీథులన్నీ సందడిగా వున్నాయి.

షాపుల్లో దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి.

టాక్సీ కొంత దూరం వెళ్ళిన తర్వాత పెద్దగా అరుస్తూ కొంతమంది మనుషులు రోడ్డమీద పరిగెత్తుకుంటూ వస్తూ

కనిపించాయి.

ఆగిపోయింది టాక్సీ.

కొంచెం దూరంలో ఓ మోటారుకారు తగలబడి పోతూ కనిపించింది.

మంటలు పైకి వస్తున్నాయి.

ఆ మంటల చుట్టూ తిరుగుతూ పెద్దగా అరుస్తున్నారు.

"ఏం జరుగుతోందక్కడ?" తల బయటపెట్టి చూస్తూ అడిగాడు భారత్.

టాక్సీని పక్కనే వున్న మరో వీధిలోకి తిప్పుతూ అన్నాడు డ్రైవర్.

"లిబరేషన్ సొసైటీ వాళ్ళు అల్లరిచేస్తున్నారు."

"ఇక్కడ ఈ సొసైటీ వాళ్ళ అల్లరు ఎప్పుడూ జరుగుతూనే వుంటాయి. ఈసారి కొంచెం తీవ్రస్థాయిలో జరుగుతోంది. విప్లవం పేరుతో ఆస్తులను నాశనం చేయటమే ఈ సొసైటీ వాళ్ళ లక్ష్యం."

చెబుతోంది సెల్లా.

టాక్సీ ఓ నాలుగురోడ్ల కూడలిలోకి వెళ్ళింది.

అక్కడే ఓ టర్నింగ్ తిరగబోయే ముందు ఎక్కడి నించో రాళ్ళు వచ్చి టాక్సీ వెనుక పడ్డాయి.

వేగంగా ముందుకు దూసుకుపోయింది కాబట్టి వెనుక అద్దం పగలేదు.

"మన స్టార్టింగ్ బాగోలేదు" అన్నాడు భారత్ వెనక్కు తిరిగి చూస్తూ.

ఇంకా కొంతమంది యువకులు రాళ్ళు విసురుతూనే వున్నారు.

షాపులు వరుసగా క్లోజ్ చేస్తున్నారు.

"మీ ఇండియన్స్‌కు సెంటిమెంట్స్ యెక్కువను కుంటాను" నవ్వుతూ అన్నది స్టెల్లా.

"అవును. ఇందులో రియాలిటీ వుంది. నీకు చెప్పినా అర్థంకాలేదు. నువ్వూ ఫీల్ ఐనప్పుడే నీకు తెలుస్తుంది."

"ఆల్ రైట్ ....ఒప్పుకుంటున్నాను."

అతను నవ్వాడు.

కళ్ళముందు కెరోన్ రూపం కదులుతోంది. ఆమెను చంపకుండా వుండవలసింది. వజ్రాల సేకరణలో తనకు ఎంతగానో సహాయపడింది.

జీవితంలో యెన్నడూ మరచిపోలేనంత సుఖాన్ని ఇచ్చింది. తనతో ఇండియాకు వస్తానన్నది.

తను ఒప్పుకున్నాడు.

తన నే నమ్ముకుని వచ్చేసింది. కాని—

జరిగిం దేమిటి?

హత్య....చావును తెచ్చుకున్నది.

ఈ ఆలోచనల్లో భారత్ టాక్సీ ఏర్‌పోర్టు ముందు ఆగటాన్ని తెలుసుకోలేదు.

అప్పటికే స్టెల్లా దిగి ఫేర్ చెల్లించి "డియర్ సర్.. ఏర్ పోర్టు వచ్చింది. ఇక దిగుతారా?" అన్నది.

అతను సిగ్గుపడి డోర్ తెరుచుకుని దిగాడు.

"ఏమిటి అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్?"

"కెరోన్ గురించే....ఎందుకో ఆమె చావు నాలో ఓ విధమైన భయాన్ని కలిగిస్తోంది స్టెల్లా."

నవుస్తున్నదల్లా ఆగిపోయి "అసలు నిన్ను కూడా షూట్ చెయ్యాలి....ఐనా దాంతో నీ తిరుగుళ్ళేమిటి? ఇడియట్ నాకంటే అందంగా వుందనా?" అన్నది.

(సశేషం)